నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
12 | మహబూబ్‌నగర్, మంగళవారం 12 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET



పోలీస్ పికెటింగ్

## భయం గుప్పిట్లో గ్రామాలు..

కొడంగల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీ కోసం గిరిజనుల భూములు లాక్కునేందుకు ప్రయత్నం జరుగుతున్నది. బొంరాస్‌పేట, దుద్యాల మండలంలో ఎక్కువ మంది లంబాడాలు నివసిస్తున్నారు. ఇప్పుడిప్పుడే వాళ్లంతా తమకాళ్లపైతాము నిలబడి వ్యవసాయాన్ని నమ్ముకొని వంద లాది కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరంతా చిన్న, సన్నకారు రైతులే. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాలం కలిసి రావడంతో వలస పోయిన వారంతా తిరిగి వచ్చారు. వ్యవసాయాన్ని నమ్ముకొని నాలుగు ముద్దలు నోట్లో పెట్టుకునే టైంలో ఫార్మాసిటీ పేరుతో ఈ రైతుల భూములు లాక్కునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీకి తమ భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. అందుకే వాళ్లంతా తెగించి తిరగబడ్డారు. ప్రస్తుతం ఏం జరుగుతుందోనన్న ఆందోళన గ్రామస్తుల్లో నెలకొంది. రెండు మండలాల్లోని గ్రామాలు భయం గుప్పిట్లో ఉండి పోయాయి. తాము ఓటు వేసిన నాయకుడు సీఎం అయ్యాడని ఆనందపడాలో.. పెద్దల కోసం గద్దలా తమ భూమిని లాక్కుంటున్నాడని బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొన్నది.



లగచర్ల గ్రామంలో ఘర్షణ వాతావరణం

## లగచర్లలో ఉద్రిక్తత

- అధికారులపై తిరగబడిన రైతులు, గ్రామస్తులు
- మా ప్రాణం పోయినా ఫార్మా కంపెనీని ఈ ప్రాంతానికి రానివ్వం
- హెచ్చరించిన అన్నదాతలు

కోస్గి, నవంబర్ 11 : కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వాలంటూ అభిప్రాయ సేకరణకు సోమవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కాడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కొడంగల్, దుద్యాల తాసీల్దార్లు విజయ్‌కుమార్, కిశోర్‌తో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటు చేయగా గ్రామస్తులు, రైతులు మా భూములు ఇవ్వం.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నినాదాలు చేశారు. కానీ అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన వారు వినిపించుకోకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. అయితే ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తే ఊరు మొత్తం ఖాళీ చేయాల్సి వస్తుందని, వ్యవసాయం పూర్తిగా అంతం అవుతుందని రైతులు ముందునుంచే వ్యతిరేకిస్తున్నారు. ఇదే విషయంలో గతంలో కాంగ్రెస్ నాయకుడిని గ్రామ పంచాయతీలో వేసి రైతులు బంధించారు. తాజాగా కలెక్టర్, కాడ అధికారితోపాటు పలువురు అధికారులను గ్రామం విడిచి వెళ్లిపోవాలని వెంబడించారు. వారి వాహనాలపై రాళ్లు, కర్రలు విసిరారు. మా ప్రాణాలు పోయినా మా ప్రాంతానికి ఫార్మాను రానివ్వమని రైతులు హెచ్చరిస్తున్నారు.

### కాంగ్రెస్ నాయకుల దుష్ప్రచారం

బీఆర్‌ఎస్ నాయకులు ముందస్తు ప్లాన్‌తో కలెక్టర్‌పై దాడి చేశారంటూ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు. లగచర్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడి భూమి ఫార్మా కంపెనీలో పోతుందని గ్రామ రైతులతో కలిసి ఫార్మాకు వ్యతిరేకంగా పోరాడుతున్నాడు. గతంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిసైతం ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా మద్దతు ప్రకటించారు. ఫార్మా కంపెనీ ఏర్పడితే కోస్గి వరకు కాలుష్యం ఏర్పడుతుంది. అందుకే ఫార్మాను వద్దని కోరుతున్నాం. *- శాసం రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్, నారాయణపేట*

- ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తూ కలెక్టర్, కాడ స్పెషల్ ఆఫీసర్‌పై దాడి
- రణరంగంగా మారిన లగచర్ల
- అధికారుల వాహనాలు ధ్వంసం
- కర్రలు, రాళ్లు, చెప్పులతో వెంటపడ్డ జనం
- గ్రామం నుంచి కాంగ్రెస్ నేతల పరార్
- సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ సర్కారు
- రైతులను అణచివేసేందుకు ప్రత్యేక బలగాలు రంగంలోకి..
- భయం గుప్పిట్లో కొడంగల్ నియోజకవర్గం



ఫార్మా కంపెనీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న లగచర్ల గ్రామస్తులు

# సీఎం ఇలాకాలో తిరగబడ్డ రైతులు

## ఫార్మా కంపెనీ వద్దంటూ ఆందోళన



అధికారుల వాహనాలపైకి రాళ్లను రువ్వుతున్న ఆందోళనకారులు

మహబూబ్‌నగర్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పచ్చని పొలాలను చరబట్టి ఫార్మా కంపెనీ పేరుతో రైతుల నుంచి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ కుటీల నీతిపై రైతులు తిరగబడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో కలెక్టర్‌తోపాటు కాడ స్పెషల్ ఆఫీసర్‌పై దాడి చేశారు. అడ్డొచ్చిన అధికారులపై రాళ్ల వర్షం కురిపిస్తూ వాహనాలను ధ్వంసం చేశారు. గ్రామస్తులు ఆగ్రహావేశాలకు ఉన్నతాధికారులు భయంతో పారిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ సమీపంలోని ఆమనగల్, కడ్తాల్, ఇబ్రహీంపట్నం సమీపంలో ఫార్మాసిటీ కోసం భూములు గుర్తించారు. ఇక్కడ అంతా ప్రభుత్వ భూములే ఉండడంతో రైతులు, ప్రజల నుంచి పెద్దగా వ్యతిరేకత రాలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఫార్మాసిటీ అక్కడి నుంచి మార్చింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలిచి ముఖ్యమంత్రి అయిన రేవంత్ తన నియోజకవర్గంలో ఈ ఫార్మాసిటీని ఏర్పాటుకు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. ఇప్పుడిప్పుడే కరువు కాటకాలనుంచి బయటపడుతున్న కొడంగల్ నియోజకవర్గం పచ్చని పంటపొలాలతో కళకళలాడుతున్నది. కాయకష్టం చేసి బతుకుతున్న సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ ఉన్నారు. వారి పొలాలే టార్గెట్‌గా ఈ ఫార్మాసిటీ కోసం సేకరించాల్సి రావడంతో ఆ కుటుంబాలు వీధినపడే పరిస్థితి ఏర్పడింది. దీన్ని జీర్ణించుకోలేని రైతులంతా ఫార్మాసిటీని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. తమ ప్రాణాలు పోయినా పర్వాలేదంటూ దీన్ని ఏర్పాటు చేయవద్దని కోరుతున్నారు. సీఎం నియోజకవర్గం కావడంతో అధికార యంత్రాంగం హల్‌చల్ చేస్తోంది. పైగా కాంగ్రెస్ నేతలు కూడా భూములు ఇవ్వండి అంటూ దబాయిస్తున్నారు. ఇవ్వకపోతే ప్రభుత్వమే గుంజుకుంటుందని బెదిరిస్తున్నారు. వందలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రావడంతో వారంతా ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీ పెట్టనీయమని భీష్మించుకూర్చున్నారు. అయితే సీఎం కార్యాలయం నుంచి ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభించి రైతులను ఒప్పించి భూములు తీసుకోవాలని ఆదేశాలొచ్చాయి.

***రణరంగంగా..***

తమ ప్రాణాలు పోయినా ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వమని రైతులు ఏకమయ్యారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో సర్కారు చేస్తున్న కుటిల యత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సోమవారం కలెక్టర్ ప్రతీక్ జైన్.. కాడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, దుద్యాల, కొడంగల్ తాసీల్దార్లు మరి కొంత మంది అధికారులు గ్రామానికి వెళ్లారు. రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించగా వారంతా ససేమిరా అన్నారు. ప్రభుత్వం ఇక్కడ ఫార్మాసిటీ ఏర్పాటు చేయడానికి అన్ని రకాలుగా సంసిద్ధమైందని తెలపడంతో ఆగ్రహించిన గ్రామస్తులు కలెక్టర్లు వెంటపడి తరిమారు. అప్పటికే ప్రశాంతంగా ఉన్న లగచర్ల గ్రామం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఇదివరకు ఆఫీసర్లు కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను గ్రామస్తుల నుంచి కాపాడి కారులో ఎక్కించారు. అయినా వెంటబడి కారు డ్రైవర్‌పై దాడికి దిగారు. కారులో కలెక్టర్ కూర్చున్న చోట ఓ మహిళ దగ్గరికి వెళ్లి రెండు చేతులతో అద్దంపై కొట్టింది. లోపల ఉన్న కలెక్టర్ కిందికి వంగి వాహనాన్ని స్పీడ్‌గా పోనిచ్చారు. వెంట ఉన్న ఎస్కార్ట్ వాహనంపై రాళ్లతో దాడి చేయడంతో కారు అద్దాలు పగిలిపోయాయి.

కాగా అక్కడే ఉన్న కాడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి ఎంత చెబుతున్నా వినకపోవడంతో ఆయనపై దాడికి దిగారు. దీంతో ఆయన గ్రామస్తులు దాడి నుంచి తప్పించుకోవడానికి పొలాల వెంట పరిగెత్తారు. ప్రజలు అంతటితో ఆగకుండా ప్రభుత్వ అధికారుల వాహనాలను చెప్పులు, రాళ్లు, కర్రలతో ధ్వంసం చేశారు.

**పోలీసుల గుప్పిట్లో లగచర్ల..**

కలెక్టర్ ఇతర అధికారులపై రైతులు తిరగబడడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు బలగాలను లగచర్లలో రంగంలో దించారు. గ్రామం మొత్తాన్ని జల్లెడ పడుతున్నారు. పోలీసుల రాకతో గ్రామస్తులంతా ఇండ్లల్లోకి వెళ్లి దాక్కున్నారు. అనుమానితులను రాత్రికిరాత్రే పోలీసులు అదుపులోకి తీసుకుంటాలని ప్రచారం జరగడంతో చాలామంది గ్రామం వదిలి పారిపోయారు. కాగా దాడి జరుగుతున్న టైంలో కాంగ్రెస్ నేతలంతా సమాధానం చెప్పుకోలేక అక్కడ నుంచి పారిపోయారు. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పోలీసు ఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

## వన్యప్రాణి అలుగులపై వేటగాళ్ల కన్ను

- విక్రయ ముఠాను అరెస్టు చేసిన అటవీశాఖాధికారులు



అచ్చంపేట, నవంబర్ 11 : నల్లమలలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు అటవీ ప్రాంతంలో వన్యప్రాణి అలుగుల వేట సంచలనంగా మారింది. అటవీ ప్రాంతం నుంచి అలుగును పట్టుకొని హైదరాబాద్‌కు తరలిస్తున్న ముఠాను అటవీశాఖ అధికారులు పట్టుకొని విచారిస్తున్నారు. నల్లమలలో కూడా అలుగులు ఉన్నట్లు ఈ సంఘటన ద్వారా బయటపడింది. ఈ ప్రాంతంలో మొదటిసారి ఇప్పుడే అలుగుల వేట బయటకు వచ్చింది. అలుగు ముఠా నల్లమలలో పాగా వేసినట్లు వెల్లడైంది. వీటిని వేటాడి విక్రయించి సులభంగా డబ్బులు సంపాదించుకోవచ్చనే అత్యాశతో విక్రయించేందుకు తీసుకెళ్తున్న అలుగును వారి నుంచి అటవీశాఖ అధికారులు ప్రాణాలతో కాపాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం పెట్రల్‌చేను, మద్దిమడుగు, పిల్లి గుండ్లకు చెందిన చెంచులు, ఉడిమిళ్లకు చెందిన యాదవ్, జడ్చర్లకు చెందిన ఒకరు, హైదరాబాద్‌కు చెందిన మరొకరిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. స్థానికులు కలిసి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారస్తుడితో నల్లమల నుంచి అలుగులు సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు జడ్చర్ల వ్యక్తి ద్వారా హైదరాబాద్‌కు విక్రయించేందుకు మాట్లాడినట్లు తెలిసింది. వీరి గుట్టు గురించి హైదరాబాద్‌లోని అటవీశాఖ ఇంటెలిజెన్స్ అధికారులకు సమాచారం అందగా.. వెంటనే స్థానిక ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం శ్రీశైలం-హైదరాబాద్ రోడ్డు మార్గమధ్యంలో ఉన్న హాజీపూర్ చౌరస్తా వద్దకు పట్టుకున్న అలుగును తీసుకొని రాష్ట్ర రాజధానికి చెందిన వ్యక్తికి అప్పగించేందుకు ముఠా సభ్యులు వచ్చారు. అప్పటికే నిఘా ఉంచిన అధికారులు పట్టుకున్నారు. మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకోగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. అలుగును ప్రాణాలతో కాపాడారు. పట్టుబడిన వారిని మన్ననూర్‌లో అటవీశాఖ కార్యాలయంలో విచారిస్తున్నారు. విచారణలో ముఠా సభ్యులు పొంతన లేని సమాధానాలు ఇస్తున్ననట్లు సమాచారం. పాంగోలియన్ అని కూడా పిలిచే అలుగు ముంగీసను పోలి ఉంటుంది. వీటి పెంకులను చైనా, ఇతర దేశాల్లో మెడిసిన్ తయారీకి ఉపయోగిస్తారని తెలిసింది. పొలుసులను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక మందుల తయారీలో ఉపయోగిస్తారట.

## భారమవుతున్న కిరాయిలు



మిల్లు వద్ద రైతుల ఎదురుచూపులు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 11 : పత్తి కొనుగోలు కేంద్రాలు సోమవారం నుంచి బంద్ కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు నిబంధనలు విధించడంతో ఉండవల్లి మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో పత్తిని కొనుగోళ్లను నిలిపివేశారు. ఈ విషయం తెలియని రైతులు శనివారం నుంచి ఆటోలు, ట్రాక్టర్లలో వేల క్వింటాళ్ల పత్తిని మిల్లు వద్దకు తీసుకొచ్చారు. సమ్మె విరమిస్తేనే కొనుగోలు చేస్తామని యాజమాన్యం చెప్పడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. వందల వాహనాల్లో పత్తిని నింపుకొని మిల్లు వద్దకు వచ్చామని, ఇప్పుడు కొనుగోలు చేయడం లేదని చెబితే ఎక్కడికి వెళ్లాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుంచి వాహనాల్లో పత్తిని తొక్కి ఉంచామని పత్తి చెడిపోతుందని ధర పలకకపోతే నష్టపోతామని, వాహనాల కిరాయిలు కూడా కట్టాలని, అధికారులు స్పందించి పత్తిని కొనుగోలు చేయాలని రైతులు కోరారు.



### టోకన్లు ఎందుకిచ్చారు..

పత్తిని కొనుగోలు చేస్తామని టోకన్లు ఇవ్వడంతో వాహనాల్లో తీసుకొచ్చాం. మిల్లు వద్దకు వస్తే కొనుగోలు చేయడం లేదని యాజమాన్యం అంటున్నది. అలాంటప్పుడు టోకెన్లు ఎందుకు ఇచ్చారు. మాకు ముందుగానే సమాచారం ఇచ్చి ఉంటే తీసుకొచ్చేవాళ్లం కాదు కదా. కిరాయిలు మీద పడేవికావు. *- జగదీశ్వర్‌రెడ్డి, పత్తి రైతు, ఉండవల్లి*

## పత్తి రైతుల పరేషాన్

- సమ్మెతో మూతపడిన మిల్లులు
- అన్నదాతల ఇబ్బందులు



తిప్రాస్‌పల్లి మిల్లు వద్ద బారులుదీరిన పత్తి ట్రాక్టర్లు

ఊట్కూర్, నవంబర్ 11 : తెలంగాణ కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు కాటన్ జిన్నింగ్, ప్రెస్సింగ్ ఇండస్ట్రీ యజమానులు సోమవారం పత్తి కొనుగోళ్లను నిలిపి బంద్ పాటించారు. మక్తల్ మండలం గుడిగండ్ల వద్ద ఏర్పాటైన లక్ష్మీదుర్గ ఆంజనేయ కాటన్ మిల్లు, లింగంపల్లి సమీపంలోని సిద్ధివినాయక కాటన్ ఇండస్ట్రీ, ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లి శివారులోని విజయ కాటన్ ఇండస్ట్రీ, తిమ్మారెడ్డిపల్లితండా వద్ద ఉన్న మారుతి ఆగ్రో ఇండస్ట్రీ, ధన్వాడ మండలం లింగంపల్లి వద్ద ఉన్న భాగ్యలక్ష్మి పత్తి మిల్లు యాజమాన్య సంస్థలు పత్తి కొనుగోళ్లను నిలిపి సంపూర్ణ బంద్ పాటించారు. దీంతో ఆయా ఇండస్ట్రీల వద్ద పత్తి కొనుగోళ్లు నిలిచి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పొద్దస్తమానం వాహనాలతో పడిగాపులు కాచారు. అర్ధరాత్రి వేళ ఇండస్ట్రీల వద్దకు చేరుకుని వాహనాలను క్యూలో నిలిపిన రైతులు సోమవారం ఉదయం 10 దాటినా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో వాహనాల అద్దె తమకు భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి గిట్టుబాటు ధరలు రావడం లేదని, మరో పక్క కొనుగోళ్లు నిలిచి అవస్థలు పడుతున్న తమను ప్రభుత్వం గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. ఇండస్ట్రీ యజమానుల సమ్మెతో కొనుగోళ్లుఆలస్యం అవుతాయని కొందరు రైతులు కర్ణాటక రాయిచూర్‌లో పత్తి అమ్ముకునేందుకు తరలించారు. కాగా, సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో కొత్త నిబంధనలను అమలు చేయడంతో కొనుగోళ్లు సీజన్ దాటి పోతుందని, ఎల్2, ఎల్3 మిల్లులు మూతపడే పరిస్థితి ఉందని ఇండస్ట్రీ యజమానులు చెబుతున్నారు. ప్రభుత్వం నిబంధనలను ఎత్తి వేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, మధ్యాహ్నం 2 తర్వాత సీసీఐ సీఎండీతో రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జరిపిన చర్చలు సఫలమైనట్లు సమాచారం రావడంతో యథావిధిగా కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యాలు ప్రకటించారు.





## మిల్లు వద్ద వాహనాల బారులు

మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 11 : అడ్డాకుల మండల కేంద్రంలో ఎస్‌ఎస్‌వీ కాటన్‌మిల్లు వద్ద పత్తి రైతులు పడిగాపులు కాస్తున్నారు. అధికారులు మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా.. రైతులు తెల్ల బంగారం అమ్మకానికి వాహనాల్లో భారీగా తరలివచ్చారు. శనివారం ఉదయం నుంచి వాహనాలు బారులు దీరాయి. శని, ఆదివారం కొనుగోలు కేంద్రం బంద్ అని బోర్డు పెట్టారు. సోమవారం 3 గంటల వరకు అయినా కొనుగోలు చేస్తారంటే అదీ లేదు... రాష్ట్ర వ్యాప్తంగా బంద్ ప్రకటించారు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మిల్లు నుంచి జాతీయ రహదారి వరకు వాహనాలు నిలిచి పోగా.. రైతులు రాత్రి, పగలు అక్కడే కాపలా కాస్తున్నారు. వారికి ఇంటి వద్ద నుంచి ఉదయం, సాయంత్రం ఒకరు చొప్పున భోజనం తీసుకొచ్చి ఇచ్చిపోతున్నారు. వాహనాలు అక్కడే ఉండడంతో యజమానులు రెట్టింపు కిరాయి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారట.

### తిండికి అవస్థలు పడుతున్నం..

రెండెకరాల్లో పత్తి సాగు చేశా. అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఈ ఏడాది పత్తికి ధరలు లేక పోవడంతో పెట్టుబడి సైతం చేతికి అందే పరిస్థితి లేదు. అర్ధరాత్రి ట్రాక్టర్ లోడుతో వచ్చి ఇక్కడే పడుకున్న. మధ్యాహ్నం 2 గంటలు గడిచినా కొనలేదు. సమ్మె చేస్తున్నట్లు ఇక్కడికి వచ్చిన తర్వాత తెలిసింది. తిండికి సైతం తిప్పలు పడుతున్నం. *- శేఖర్, రైతు, అవుసలోనిపల్లి*



### కౌంటరో లేదో చెప్పడం లేదు..

దళారులను నమ్మి మోసపోవద్దన్న అధికారుల మాటలు విని సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చాను. రెండ్రోజులైంది.. కౌంటరో లేదో కూడా చెప్పడం లేదు. ఇక్కడికి తీసుకురాకుంటే వచ్చిన కాడికి ఎవరికో ఒకరికి అమ్ముకునేటోళ్లం. తిండీ తిప్పలు లేకుండా పడిగాపులు కాస్తున్నాం. సతాయిస్తే కేంద్రాలకు ఎవరూ రారని ఉల్టా తిప్పలు పెడుతున్నారేమో..? *- ఎల్లారెడ్డి, వెంకంపల్లి, చిన్నచింతకుంట మండలం*



## అధికారిక ప్రోగ్రాంలో కాంగ్రెస్ నేతల హడావుడి

- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డిసమక్షంలోనే హల్‌చల్
- అధికారుల నరాజ్



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమ స్టేజీపై ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి సమక్షంలోనే కూర్చున్న, మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మరికల్, నవంబర్ 11 : ప్రభుత్వ అధికారిక సమావేశంలో కాంగ్రెస్ నాయకులు హడావుడి చేస్తూ.. స్టేజీపై మైక్‌ను తీసుకొని పార్టీ కార్యక్రమంగా మార్చిన సంఘటన నారాయణపేట జిల్లాలో జరిగింది. సోమవారం మరికల్ మండల కేంద్రంలోని సూర్యచంద్ర ఫంక్షన్‌హాల్‌లో మరికల్, ధన్వాడ మండలాల్లోని లబ్ధిదారులకు కల్యాణచెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైంది. అయితే ఈ ప్రోగ్రామ్‌లో అధికారుల మాట వినకుండా ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులే పార్టీ కార్యక్రమంగా వ్యవహరించి లబ్ధిదారులను పిలిచి.. ఫొటోలకు ఫోజులిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై అధికారులు నరాజ్ అయ్యారు. మరికల్, ధన్వాడ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వీరన్న, నరహరి, ధన్వాడ మాజీ సింగిల్‌విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ గొల్ల కృష్ణయ్య, పుస ప్రమోద్ రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు హరీశ్ కుమారులు స్టేజీపై కూర్చోవడంతో అధికారులు చేసేది లేక పక్కన మిన్నకుండిపోయారు. అధికార కార్యక్రమంలో నాయకులు పోటా పోటీగా స్టేజీపై కూర్చోవడంతోపాటు ప్రసంగాలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## బంగారం అమ్మకానికి వాల్యూ గోల్డ్





మొబైల్ గోల్డ్ వ్యాన్ వద్ద సంస్థ ప్రచార కర్తలు, ప్రతినిధులు

- ఉమ్మడి పాలమూరులో నేటి నుంచి డిసెంబర్ 7 వరకు మొబైల్ వాహన సేవలు
- మీ ప్రాంతానికే వచ్చి బంగారం కొనుగోలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నవంబర్ 11 : ఆయా కుటుంబాల ఆర్థిక అవసరాలను తీర్చే ఉద్దేశంతో వారు అమ్మాలనుకున్న బంగారాన్ని వారి ప్రాంతానికే వచ్చి కొనుగోలు చేసే సంచార వాహనాన్ని వాల్యూ గోల్డ్ సంస్థ ప్రారంభించింది. బంగారం అమ్మకానికి నాణ్యమైన సంస్థ వాల్యూ గోల్డ్‌గా ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు బంగారం కొనుగోలు చేసేందుకు ఈ తరహా వాహనాన్ని ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారన్నారు. వాహనం ద్వారా బంగారానికి అక్కడికక్కడే స్వచ్ఛత పరీక్ష నిర్వహించడంతో పాటు అమ్మకందారులు నష్టపోకుండా ధర నిర్ణయించి అందజేస్తామన్నారు. బంగారం కొనడం తోపాటు తనఖా పెట్టిన బంగారాన్ని విడిపించడం, బంగారు, వెండి నాణేల అమ్మకాలు చేస్తామన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో ప్రారంభించామని, ప్రస్తుతం 5 శాఖల ద్వారా హైదరాబాద్ ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన మరిన్ని సేవలు అందించేందుకు వాల్యూ గోల్డ్ గ్రామాలకు విస్తరించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇప్పటి వరకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో సేవలు విస్తరించామని ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నేటి నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు మొబైల్ గోల్డ్ వ్యాన్ ద్వారా సేవలు అందిస్తామని తెలిపారు.

***మొబైల్ గోల్డ్ వ్యాన్ సేవలు ఇలా..***

మొబైల్ గోల్డ్ వ్యాన్ సేవలు ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు లహరీ గార్డెన్స్, నాగర్‌కర్నూల్ జిల్లాలో అందుబాటులో ఉంటాయి. 17-20వ తేదీ వరకు దాచ లక్ష్మయ్య ఫంక్షన్‌హాల్ వనపర్తి జిల్లా, ఈ నెల 21-25 వరకు స్టార్ ఈవెంట్ హాల్ జోగులాంబ గద్వాల జిల్లా, ఈ నెల 26-29 వరకు ఎస్‌ఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ నారాయణపేట జిల్లా, ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు షాలీమార్ ఫంక్షన్‌హాల్, మహబూబ్‌నగర్‌లో ఈ వాహన సేవలు అందుబాటులో ఉంటాయి.

